క్లుప్తంగా

బియ్యపు గింజపై శ్రీకృష్ణుని చిత్రం



ఏలూరు (టూటౌన్): శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా బియ్యపు గింజపై శ్రీకృష్ణుని చిత్రాన్ని రూపొందించి అబ్బుర పరిచారు మైక్రో ఆర్టిస్ట్ దోర శివప్రసాద్. ఆయన్ని ఏలూరు నగర వాసులు అభినందించారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న న్యాయవాది పావని

ఏలూరు (టూటౌన్): నేటి బాలలు ఉత్తమ పౌరులుగా తమకు తాము తీర్చిదిద్దుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలని న్యాయవాది పావని సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆమె శనివారం సందర్శించారు. బాలల హక్కులు, చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. గర్భస్థ శిశువు నుండే పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన బిడ్డగా జన్మించే హక్కు, విద్యా హక్కు, జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర హక్కు మొదలైన హక్కులను పౌరులకు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. అనంతరం బాలలకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

20న ఎలక్ట్రికల్ వర్కర్ల రాష్ట్ర సమావేశం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలు సమస్యలపై తీర్మానాలు చేసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నామని పేర్కొన్నారు.

బహుజనులంతా ఐక్యంగా ఉండాలి

ఏలూరు (టూటౌన్): బహుజనులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సంపత్ రావు పిలుపునిచ్చారు. ఏలూరులో శనివారం సాయంత్రం జరిగిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో అంబేడ్కర్ ఆలోచనా విధానంతో, కాన్షీరామ్ పని విధానంతో పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్, నేతలు పాల్గొన్నారు.

బాలబాలికలకు అండగా ఆపరేషన్ ట్రేస్

- తల్లిదండ్రుల చెంతకు పిల్లలు
- మిస్సింగ్ కేసులపైనా దృష్టి
- 12 మందిని ట్రేస్ చేసిన పోలీస్ అధికారులు



ఆపరేషన్ ట్రేస్‌లో బాలలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు, మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, శక్తి టీమ్ (ఫైల్)

ఏలూరు టౌన్: ఆహ్లాదకరంగా, తల్లిదండ్రులు, బంధువులతో సంతోషంగా జీవించాల్సిన బాల్యం భారంగా మారుతోంది. సామాజికంగా అనేక అంశాలు చిన్నారుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. తల్లిదండ్రుల ఆలనాపాలనా లేక వీధి బాలలుగా, అనాథలుగా హోమ్స్‌లో, బాలకార్మికులుగా ఆయా ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ భారంగా జీవితాన్ని గడుపుతున్న బాలలకు పోలీస్ అధికారులు అండగా నిలిచేందుకు ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటినుంచి దూరమై ఎక్కడో జీవిస్తోన్న పిల్లలను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, శక్తి టీమ్, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాలలను గుర్తించి వారి ఇంటికి చేర్చుతున్నారు.

బంధువుల చెంతకు బాలబాలికలు

ఎస్పీ కేపీ శివకిషోర్ పర్యవేక్షణలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, శక్తిటీమ్ బృందం ఆపరేషన్ ట్రేస్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక బాలుడి తండ్రి మరణించగా తల్లి వేరొక వ్యక్తిని వివాహం చేసుకుంది. దీంతో ఆ బాలుడిని చెన్నై ప్రాంతంలో ఒక కుటుంబానికి పెంపకానికి ఇచ్చారు. ఆ బాలుడు ఇంట్లోనుంచి పారిపోయి బయట వీధి బాలుడిగా తిరుగుతూ ఉండగా చెన్నైలోని చైల్డ్‌లైన్ గుర్తించి హోమ్‌లో ఉంచారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) విచారణ చేయగా భీమవరం పరిసర ప్రాంతానికి చెందిన బాలుడిగా గుర్తించారు. ఇదే సమయంలో ఏలూరు మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, శక్తిటీమ్ బాలుడి బంధువులను గుర్తించారు. తల్లి లేకపోవటంతో ఆ బాలుడిని తన అక్క, అన్న, పిన్నికి అప్పగించారు. ఇలా పశ్చిమగోదావరి జిల్లా మార్టేరుకు చెందిన ఇద్దరు, బ్రాహ్మణచెరువుకు చెందిన ఇద్దరు, విస్సాకోడేరుకు చెందిన ఒక బాలుడు, అమలాపురానికి చెందిన ఒక బాలుడ్ని వారి బంధువుల చెంతకు చేర్చారు. ఈ ఆరుగురిలో ఇద్దరు బాలికలు, నలుగురు బాలురు ఉన్నారు.

పలువురి గుర్తింపు

రెండేళ్లకు పైగా మిస్సింగ్ కేసులను పోలీసులు ఛేదించారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో క్రైమ్ 222/2019 కేసును ఛేదించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ తన ఇద్దరు చిన్నారులను తీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. వీరిని స్పెషల్ టీమ్ ఇన్‌చార్జి కైకలూరు టౌన్ ఎస్సై వెంకటకుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కనకాంబరం, పాండురంగారావు, కానిస్టేబుల్ విజయ్, మహిళా కానిస్టేబుల్ చైతన్య తెలంగాణ వరంగల్ జిల్లాలో తల్లి, ఇద్దరు బాలలను గుర్తించారు. తడికలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ, ఇద్దరు బాలలు హోమ్స్‌లో ఆశ్రయం పొందుతూ ఉండగా గుర్తించి వారిని బంధువులకు అప్పగించారు. మొత్తానికి ఆపరేషన్ ట్రేస్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో 12 మందిని వారి కుటుంబాలకు అప్పగించారు.

బాలల హక్కుల పరిరక్షణే లక్ష్యం



ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని ఆగస్టు నెలాఖరు వరకు చేపట్టేందుకు చర్యలు చేపట్టాం. శక్తి టీమ్, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ హోమ్స్, స్వచ్ఛంద సంస్థల హోమ్స్, ఇతర ప్రాంతాల్లోని బాలల తల్లిదండ్రులు, బంధువులను గుర్తించి వారిని అప్పగించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. బాలల హక్కులకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టం మేరకు చర్యలు తప్పవు. బాలల జీవించే హక్కును పరిరక్షించేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– ఎం సుబ్బారావు, ఏలూరు మహిళా స్టేషన్ సీఐ

శ్రీకాకుళం జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టాలి



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): శ్రీకాకుళం జిల్లాకు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టాలని బీసీ కులాలు, ఉద్యోగుల జేఏసీ పిలుపు నిచ్చింది. స్థానిక తంగెళ్లమూడి వంతెన సమీపంలో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం శనివారం ఏపీ ఓబీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, బీసీ కులాలు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, నాయకులు గంటా ప్రసాద్ రావు, చిట్టి బొమ్మ రంగారావు, లంక వెంకటేశ్వరరావు, సీహెచ్ అశోక్ గౌడ్, పామర్తి ఏసు రాజు మాట్లాడారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేయనున్న నేపథ్యంలో లచ్చన్న జన్మస్థలమైన జిల్లా శ్రీకాకుళం జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టడంతో రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బీసీలను గౌరవించినట్లు అవుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉక్కుసూరి గోపాలకృష్ణ, యేసు రాజు, మార్గాన్ని శ్రీనివాస్, లక్కోజు రాజగోపాలాచారి, ఎం రాంబాబు, గొర్ల రామారావు, ఏఎన్వీ శ్రీనివాస్, వీరంకి త్రినాథ్, ఎంవీ సుబ్బారావు, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏలూరును డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి యువత సహకరించాలని ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఏలూరు జిల్లా శక్తి టీం సభ్యులు కోరారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్, సీఆర్ఆర్ కాలేజీ హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. నాడీ వ్యవస్థ దెబ్బతిని చదువులో వెనుకబడి వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, తల్లిదండ్రుల ఆశలు అడియాశలు అవుతాయని వివరించారు. ఒక విద్యార్థి డ్రగ్స్‌కు అలవాటు పడితే ముందుగా అతని స్నేహితులు లేదా రూమ్మేట్స్ వెంటనే కాలేజీ యాజమాన్యానికి లేదా పోలీసులకు గాని తెలియజే ఆ విద్యార్థికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిస అయిన వారిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించి, ఆ అలవాటును మాన్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. మత్తు పదార్థాల వ్యాపారం లేదా వినియోగం చేస్తున్నట్టు గమనిస్తే వెంటనే 1972కు లేదా పోలీసులకు, డయల్ 112 ద్వారా సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



గో సంరక్షణ సమితిలో శ్రీ కృష్ణాష్టమి వేడుక



దొండపాడు దత్తనాథ క్షేత్రం శ్రీ వేణుగోపాల స్వామి



42వ డివిజన్‌లోని శ్రీ కృష్ణ మందిరంలో వేడుక



శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ,ఎమ్మెల్యేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఏలూరు నగరంలో శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణునికి వివిధ రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ సంస్థలు చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ పోటీలు, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏలూరు గో సంరక్షణ సమితి ప్రాంగణంలో ఉదయం రాధాకృష్ణులకు క్షీరాభిషేకం, గో పూజ, లక్ష్మీ గణపతి హోమం, సాయంత్రం కోలాటం నిర్వహించారు. బాలలకు బాలగోపాల వేషధారణ పోటీల అనంతరం బాల గోపాల స్వామి వారికి ఊయల సేవ నిర్వహించారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు. దొండపాడు శ్రీ నం దత్తనాథక్షేత్రంలో శ్రీ వేణుగోపాల స్వామికి ఉదయం పంచామృత అభిషేకం, ప్రత్యేకంగా నవనీత అలంకరణ చేశారు. సాయంత్రం సుదర్శన చక్ర ఆరాధన చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు రామకోటి ప్రాంగణంలో భగవద్గీత సారాంసాన్ని ప్రజలకు వివరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. 42వ డివిజన్ ఎస్ఆర్ బీడీ కంపెనీ వారి వీధిలో శ్రీకష్ణ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ కష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఇంటి నుంచి వండిన పిండి పదార్థాలతో పరవాన్నం, చక్కెర పొంగలి, వెన్న, అటుకులు, బెల్లం, పాయసాలతో భగవంతునికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

యాదవ సంఘం భవన్‌లో..

ఏలూరు (టూటౌన్): స్థానిక ఏటిగట్టులోని యాదవ సంఘం భవన్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తో కలిసి ప్రారంభించారు. శ్రీకృష్ణునికీ ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య, ఏలూరు అధ్యక్షుడు మెరుగుమాల శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు కాట్రు బాలకృష్ణ, మల్లిపూడి రాజు, టౌన్ సెక్రటరీ గుమ్మడి సూర్యనారాయణ, నాయకులు ఆవాలు శ్రీనివాసరావు, కొమ్మ నాగరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బీట్లచిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	42	కంద	00
కాకర కాయలు	20-24	బీట్‌రూట్	38
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	30	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు- బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	37
ఏలూరు- బీహెచ్‌ఈఎల్	21.50	98509	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	24

ఐఐటీలో మెరిసిన అన్నదమ్ములు



ఆశీష్, అనీష్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్‌కు చెందిన అన్నదమ్ములు ఎస్ ఆశీష్, ఎస్ అనీష్ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీట్లు సాధించారు. ఐఐటీలో చదవాలనే కాంక్షతో ముందునుంచే ఒక ప్రణాళిక తో కష్టపడి చదవడం వల్ల తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, గురువుల సహకారంతో విజయం సాధించామని వారు తెలిపారు. ఇటీవల జరిగిన 2025, ఆల్ ఇండియా గేట్ ఎగ్జామ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ఐఐటీ గౌహతి ఎయిరోస్పేస్‌లో ఆశీష్, ఐఐటీ బాంబే మెకానికల్‌లో అనీష్ సీట్ సాధించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

యువ అథ్లెట్‌కు సన్మానం



పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి యువ పారా అథ్లెట్ కాస్సే పవన్ కుమార్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈ నెల 9న విశాఖపట్నం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మూడు ఈవెంట్స్ ఉపయోగించుకొని విజయం సాధించాడు. శనివారం పంగిడిగూడెం సెంటర్లో అతనిని అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు మానుకొండ శ్రీను, గోగులముడి సోమయ్య, కొదం కిషోర్, కాలి అశోక్, డిపల్లి సురేష్, చిన్నం భాస్కర రావు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

అప్పులతోనే కాలం గడుపుతున్న కూటమి సర్కార్

చింతలపూడి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేవలం కేంద్రం నుంచి అప్పులు తీసుకురావడంతోనే కాలం గడుపుతోందని సీపీఐ మండల కార్యదర్శి టి.బాబు విమర్శించారు. శనివారం పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, సూపర్ సిక్స్‌లోనూ కొన్నిటిని మాత్రమే అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో నియంతల పాలన



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యలగూడెం: రాష్ట్రంలో నియంతల పాలన నడుస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా మారిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పార్టీ నాయకులతో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల తీరును అపహాస్యం చేస్తూ పోలీసు వ్యవస్థ పని చేసిందన్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. కూటమి రాజకీయ నాయకుల అండదండలతో ఎన్నికల్లో నకిలీ ఓట్లు వేశారన్నారు. ఉత్తపుత్రుడు, దత్తపుత్రుడు రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారని, స్వయంగా కూటమి అగ్రనాయకులే వందల కోట్ల రూపాయల అవినీతి గురించి మాట్లాడుతున్నా అధిష్ఠానం నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని వివరించారు. జెడ్పీటీసీ ఎన్నికలు అప్రజాస్వామికంగా జరిగాయనేది జగమెరిగిన సత్యమని, ఎన్నికల కమిషన్ అచేతనంగా ఉండి కేంద్ర ప్రభుత్వం కను సన్నసల్లో కీలుబొమ్మగా మారిందని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి ఆరోపించారు. గత ఇరవై సంవత్సరాల కాలంలో చంద్రబాబు నాయుడు అరవై సార్లకు పైగా సింగపూరు పర్యటనల్లోని ఆంతర్యం ఏమిటి అనేది ప్రజలు గ్రహించారని తెలిపారు. తండ్రి కొడుకులు రాష్ట్రంలో దోచుకున్న సొమ్మును సింగపూర్‌లో పెట్టుబడుల రూపంలో పెడుతున్నారని ఆరోపించారు. సహకార సంఘాల ఎన్నికలతో సహా రాబోయే స్థానిక ఎన్నికలకు వెళ్లే దమ్ము, ధైర్యం సీఎం, డిప్యూటీ సీఎంలకు లేదని ఎద్దేవా చేశారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీటీసీలు ఘంటా శ్రీను, ఘంటసాల సీనమ్మ, ఎస్‌కే బాజీ, పార్టీ నాయకులు చిక్కాల దుర్గాప్రసాద్, నూకల రాము, పాముల నాగమునిస్వామి, కంభంపాటి బుజ్జిబాబు, నిక్కర్ నాగేశ్వరరావు, దూలపల్లి కాంతారావు, గంటా రమేష్, ఏలేటి భాస్కర్, ఘంటసాల మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వరప్రసాద పండుగ తీజ్



తీజ్ బుట్టలను తలపై ధరించిన ఆడపిల్లలు

టి.నరసాపురం : బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో బంజారాల తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా ఆడబిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన వరాల పండుగ తీజ్ అని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బంజారాలు ఈ తీజ్ పండుగను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్, సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ జీవితంలో వచ్చే కష్టాలను ఓర్చుకుంటూ, సహనంతో జీవించేలా బతుకు పాఠంను తీజ్ పండుగ నేర్పుతుందని అన్నారు. తీజ్ బుట్టలను ఆడపిల్లలు ఎత్తుకొని తీన్మార్ డబ్బులతో, సాంస్కృతిక బంజారా నృత్యాలతో ఊరంతా ఊరేగించుకుంటూ రాళ్ల చెరువులో నిమజ్జనం చేశారు. తీజ్ దీక్ష చేసిన 20 మంది ఆడబిడ్డలకు బంజారా భజరంగీ బేరి కమిటీ నాయకులు నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో మూడు శ్రీనివాస్ నాయక్, ధరావత్ బంగారయ్య, భూక్యా భిగనాదం, భూక్యా సురేష్, జరభల కృష్ణలీల, భూక్యా ధనలక్ష్మి, భవాని, లావుడియా సంధ్య తదితరులు పాల్గొన్నారు.